శ్రీరామనవమికి ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

గుజరాతీపేట : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏప్రిల్ ఐదో తేదీన పలాస, టెక్కలి, శ్రీకాకుళం కాంప్లెక్స్‌ల నుంచి భద్రాచలానికి ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు 5వ తేదీ రాత్రి ఏడు గంటలకు శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో బయలుదేరి 6న ఉదయం ఆరు గంటలకు భద్రాచలం చేరుకుంటాయని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు భద్రాచలంలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయానికి శ్రీకాకుళం చేరుకుంటాయని తెలిపారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం www.apsrtconline.in వెబ్‌సైట్‌లో కల్పించినట్లు తెలిపారు. రామతీర్థంకూ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 9959225608, 9959225609, 9959225610, 9959225611, 08942 223188 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

దిగొచ్చిన డిఇఒ

- పది మంది ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేత
- నలుగురిపై సస్పెన్షన్ యథాతథం
- తేలని విద్యార్థుల భవిష్యత్తు
- పోరాటం కొనసాగించాలని ఉపాధ్యాయుల నిర్ణయం
- నేడు డిఇఒ కార్యాలయం ముట్టడి



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉపాధ్యాయుల సస్పెన్షన్ అంశంలో జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య దిగొచ్చారు. పది మందిపై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కప్పిలి మోడల్ స్కూల్ పదో తరగతి పరీక్ష కేంద్రంలో అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో డిఇఒ తిరుమల చైతన్య 14 మందిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక నాయకులు ఈనెల 28న కలెక్టర్‌ను కలిసిన తర్వాత ఏడుగురిపై సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. ఆ తర్వాత ఆర్‌జెడి విజయభాస్కర్ డిఇఒ కార్యాలయంలో శుక్రవారం విచారణ చేపట్టి మరో ముగ్గురిపై సస్పెన్షన్ ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నారు. మాల్ ప్రాక్టీస్ వ్యవహారంలో ఇంకా నలుగురిపై యథాతథంగా సస్పెన్షన్‌ను కొనసాగిస్తున్నారు. అక్రమ సస్పెన్షన్లు, డిబార్ అయిన విద్యార్థుల భవిష్యత్తు, విధుల్లో నుంచి డిఇఒ తొలగింపు వంటి అంశాలు అపరిష్కృతంగా ఉండడంతో పోరాటం కొనసాగించాలని ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక నిర్ణయించింది.

ఎచ్చెర్ల మండలం కుప్పిలి మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో ఈనెల 21వ తేదీన నిర్వహించిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్ష సందర్భంగా మాల్ ప్రాక్టీస్ జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో 14 మందిపై డిఇఒ తిరుమల చైతన్య సస్పెండ్ చేశారు. ఇందులో ముగ్గురు ప్రధానోపాధ్యాయులు, పది మంది ఉపాధ్యాయులు, ఒక నాన్ టీచింగ్ సిబ్బంది ఉన్నారు. వీరిలో ఆరుగురిపై ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు పెట్టారు. డిఇఒ తీరుపై ఉపాధ్యాయులు భగ్గుమన్నారు. మాల్ ప్రాక్టీస్ వ్యవహారంలో కొందరు ఉపాధ్యాయులపై డిఇఒ అక్రమంగా సస్పెండ్ చేశారంటూ మండిపడ్డారు. దీనిపై అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఏకమై ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదికగా ఏర్పడి ఈనెల 24వ తేదీన శ్రీకాకుళంలోని ఎన్‌జిఒ హోంలో సమావేశమై డిఇఒ నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని నిర్ణయించాయి. ఉపాధ్యాయులపై అక్రమ సస్పెన్షన్లు రద్దు, క్రిమినల్ కేసులు ఎత్తివేత, డిబార్ అయిన విద్యార్థులకు న్యాయం, డిఇఒ తిరుమల చైతన్యను విధుల నుంచి తొలగించాలనే డిమాండ్లతో ఉద్యమ కార్యాచరణను రూపొందించాయి. అందులో భాగంగా ఈనెల 25న శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి నుంచి డిఇఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించాయి. డిఇఒ కార్యాలయం వద్ద 26న ధర్నా చేపట్టాయి. డిఇఒ తిరుమల చైతన్య తీరు, అక్రమ సస్పెన్షన్ల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశం కావడం, ఉపాధ్యాయులు రోడ్డెక్కడంతో ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ఈనెల 27న కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించిన అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను వినతిపత్రం అందించారు. అనంతరం కలెక్టర్ సూచనలతో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వరరావుతో నిర్వహించిన చర్చల ఫలితంగా ఏడుగురిపై సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. ఆర్‌జెడి విజయభాస్కర్ శుక్రవారం డిఇఒ కార్యాలయంలో విచారణ చేపట్టారు. తప్పు లేదని భావించి మరో ముగ్గురిపై సస్పెన్షన్‌ను ఎత్తివేశారు.

అక్రమ సస్పెన్షన్లపై చర్యలకు ఉపాధ్యాయుల పట్టు

మాల్ ప్రాక్టీస్ వ్యవహారంలో పది మందిపై సస్పెన్షన్ ఎత్తివేశారంటే, వారి తప్పిదం లేనట్లేనని అధికారులు అంగీకరించినట్లయింది. విచారణ చేయకుండా దుందుడుకుగా వ్యవహరించిన డిఇఒ తిరుమల చైతన్యపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. డిఇఒగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తిరుమల చైతన్య ఉపాధ్యాయ వ్యతిరేకిగా వ్యవహరిస్తున్నారని పలువురు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు 20 మంది ఉపాధ్యాయులను సరైన కారణాలేవీ లేకుండానే సస్పెన్షన్ చేస్తూ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడుతున్నారు. తిరుమల చైతన్య ఈ ఏడాది జూన్‌లో రిటైర్ కానున్నారని తెలిసింది. ఉద్యోగ విరమణ అనంతరం కమిషనరేట్‌లో ఓఎస్‌డిగా వెళ్లే ఆలోచనతో ఉన్నట్లు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. పరీక్షల నిర్వహణ, విద్యాశాఖలో కఠినంగా వ్యవహరిస్తున్నా ఒక పద్ధతి ప్రకారం పనిచేశారంటూ ప్రభుత్వ మెప్పు పొందేందుకే ఇలా వ్యవహరిస్తున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు.

పరీక్షల వేళ గందరగోళం

డిఇఒ తిరుమల చైతన్య వ్యవహరించిన తీరు పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర గందరగోళానికి దారితీసింది. పరీక్షల్లో చూచిరాతలు, విద్యార్థులు డిబార్ కావడం సాధారణమే అయినా, ఆ పేరుతో అక్రమంగా ఉపాధ్యాయులను సస్పెండ్ చేసి పరీక్షల సమయంలో గందరగోళానికి తెర తీశారని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

పోరాటం కొనసాగించాలని నిర్ణయం

ఉపాధ్యాయుల అక్రమ సస్పెన్షన్లు, విద్యార్థుల డిబార్ తదితర అంశాలు ఇంకా కొలిక్కి రాకపోవడంతో పోరాటం కొనసాగించాలని ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక నిర్ణయించింది. పది మందిపై సస్పెన్షన్ తొలగించినా, మరో నలుగురిపై యథాతథంగా ఉంచారు. ఆరుగురిపై క్రిమినల్ కేసుల అంశమూ పెండింగ్‌లో ఉంది. ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలెక్టర్‌కు సమస్యను వివరించడంతో పాటు పలు అంశాలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డిబార్ అయి నష్టపోయిన విద్యార్థులకు ఏవిధంగా న్యాయం చేయగలుగుతారన్న దానిపై కలెక్టర్ స్పష్టమైన హామీ ఇవ్వలేకపోయారని తెలిసింది. అక్రమ సస్పెన్షన్లు, పరీక్ష వేళ ఈ రాద్ధాంతానికి కారకుడైన డిఇఒ తిరుమల చైతన్యపై చర్యలు తీసుకునే విషయంలో తనకు నేరుగా డిఇఒపై చర్యలు తీసుకునే అధికారం లేదంటూ కలెక్టర్ చేతులెత్తేసిన నేపథ్యంలో, ఈ పోరాటాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులతో కలిసి భారీగా నేడు డిఇఒ కార్యాలయాన్ని ముట్టడించేందుకు సిద్ధమవుతున్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు (ఫైల్)

విద్యుత్ భారాలు వద్దు

- స్మార్ట్ మీటర్లు, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు
- ఇపిడిసిఎల్ కార్యాలయాల వద్ద నిరసనలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను, సెకీ ఒప్పందాన్ని, సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజల మద్దతుతో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇవే డిమాండ్లతో సిపిఎం రాష్ట్రవ్యాప్త ఆందోళనల్లో భాగంగా జిల్లాలోని పలు మండలాల్లో ఇపిడిసిఎల్ కార్యాలయాలు, సబ్ స్టేషన్ల వద్ద శుక్రవారం ధర్నాలు చేపట్టారు. ఇందులో భాగంగా నగరంలోని ఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి వారు మాట్లాడారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని ప్రజలను నమ్మబలికి అధికారంలోకొచ్చాక తొమ్మిది నెలల కాలంలో రూ.15.485 కోట్ల విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారాన్ని మోపి ప్రజలను దోపిడీ చేశారని విమర్శించారు. మరోవైపు 2014-19లో వినియోగించుకున్న విద్యుత్‌పై ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని, ఇవే కాకుండా 2022, 2023, 2024 సంవత్సరాల్లో కట్టిన బిల్లులపై అదనంగా సర్దుబాటు ఛార్జీలను టిడిపి కూటమి ప్రభుత్వం వసూలు చేస్తోందన్నారు. నివాసాలే కాకుండా చిన్న వ్యాపార సంస్థల నుంచి యూనిట్‌కు ఆరు పైసల నుండి రూపాయి వరకు సుంకం పెంచారని చెప్పరు. అదానీ కంపెనీ స్మార్ట్ మీటర్ రూ.13 వేల వరకు ఉంటుందని, దీని ఖరీదును 93 నెలల్లో ప్రతి నెలా బిల్లులో వసూలు చేస్తారని తెలిపారు.

కూటమి ప్రభుత్వం టైమ్ ఆఫ్ ది డే పేరుతో కొత్త విధానాన్ని ప్రవేశపెట్టిందని, దీని ప్రకారం కరెంటు అధికంగా వాడే సమయంలో యూనిట్‌కు అధిక రేటు వసూలు చేసే విధానం ముందుగా వ్యాపార సంస్థలకు ప్రారంభించిందని చెప్పారు. దీనివల్ల వినియోగదారులపై మోయలేని భారాలు పడతాయన్నారు. 24 గంటలను నాలుగు భాగాలుగా విభజించి రకరకాల రేట్లు వసూలు చేస్తారని, వేసవిలో మరింత ఎక్కువ రేట్లు ఉంటాయని తెలిపారు. స్మార్ట్ మీటర్ రీడింగ్ గంటకి పరిగణనలోకి తీసుకుంటారని చెప్పారు. మరోవైపు షిర్డీసాయి కంపెనీలో భాగమైన కంపెనీకి సోలార్ ప్యానల్ తయారీకి ఎనిమిది వేల ఎకరాల భూములు కూటమి ప్రభుత్వం కేటాయించడం సరైంది కాదని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలను ప్రజలు ప్రతిఘటించాలని కోరారు. ధర్నాలో సిపిఎం నాయకులు కె.నాగమణి, సిహెచ్.అమ్మన్నాయుడు, కొత్తకోట అప్పారావు, ఆర్.ప్రకాష్, ఎం.మహాలక్ష్మి, ఎ.లక్ష్మి, ఎం.లలిత, వి.రమణ, ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : ఎచ్చెర్లలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద చేపట్టిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.తేజేశ్వరరావు, నాయకులు డి.బంగార్రాజు, జి.శ్రీనివాసరావు, ఎపి హమాలీస్ యూనియన్ నాయకులు ఎం.సురేష్, కె.గోవిందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్, నాయకులు ఎనస్.అప్పన్న, మోహన్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలిలోని విద్యుత్‌శాఖ ఎఇ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో సిపిఎం నాయకులు కొల్లి ఎల్లయ్య, బి.వాసుదేవరావు, సిఐటియు నాయకులు హెచ్.ఈశ్వరరావు, ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలోని ఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

అవకతవకలకు పాల్పడిన మేట్ల తొలగింపు

- డ్వామా పీడీ సుధాకరరావు
- రూ.1.96 లక్షల రికవరీకి ఆదేశాలు

ప్రజాశక్తి - లావేరు

ఉపాధి హామీలో అవకతవకలకు పాల్పడే మేట్లను వెంటనే తొలగించాలని డ్వామా పీడీ బి.సుధాకరరావు ఆదేశించారు. మండల కేంద్రంలో 2023-24 సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజా వేదికను శుక్రవారం నిర్వహించారు. రూ25.60 కోట్లతో చేపట్టిన పనులకు సామాజిక తనిఖీలు నిర్వహించి గ్రామసభల్లో వివరాలు వెల్లడించామని ఎస్ఆర్‌పి పున్నపునాయుడు తెలిపారు. 33 పంచాయతీల్లో నిర్వహించిన సామాజిక తనిఖీల వివరాలను డిఆర్‌పిలు వినిపించారు. బుడుమూరు గ్రామసభలో ఐదుగురు పనికి వెళ్లకుండానే హాజరు వేసి వేతనాలు పొందారని, ఒకరికి 50 రోజులు మస్టర్ వేశారని గ్రామసభలో ఫిర్యాదు చేశారని చెప్పారు. లావేరు పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ పి.రాము పని ప్రదేశానికి వెళ్లకుండా మేట్లతో కుమ్మక్కై అవకతవకలకు పాల్పడ్డారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. పంచాయతీల్లో పలు అవకతవకలకు సంబంధించి రూ.1.96 లక్షల రికవరీ రాసినట్లు ఎస్ఆర్‌పి తెలిపారు. ఉపాధి హామీ సిబ్బందికి రూ.13,500 జరిమానా విధించారు. సామాజిక తనిఖీల్లో గుర్తించిన అవకతవకలపై విచారణకు పీడీ సుధాకర్ ఆదేశించారు. పనుల్లో అక్రమాలకు పాల్పడితే క్షమించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో డ్వామా ఫైనాన్స్ మేనేజర్ ఆర్.స్వరూపరాణి, ఎపిడి శైలజ, లోకేష్, విజిలెన్స్ అధికారి శ్రావణ్ కుమార్, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, ఎంపిడిఒ పి.వెంకటరాజు, ఎపిఒ రెడ్డి సత్యవతి, మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎఎంసి మాజీ చైర్మన్ ఐ.తోటయ్యదొర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వేదికలో వివరాలు వెల్లడిస్తున్న సామాజిక తనిఖీ సభ్యులు

నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు

ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - పలాస, కవిటి, మందస

కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో నేరాల కట్టడి, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కాశీబుగ్గ డిఎస్‌పి కార్యాలయం, కవిటి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. బాలికలు, మహిళల మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించి అత్యధిక ప్రాధాన్యతతో వాటిని విచారణ చేసి, అదృశ్యమైన వారి జాడ తెలుసుకోవాలని ఆదేశించారు. సబ్ డివిజన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. నిరంతరం డ్రోన్ కెమెరాలను వినియోగించి చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతిరోజూ గ్రామాలను సందర్శించి ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు, గొడవలు, ఘర్షణకు జరగకుండా గ్రామస్తులతో మమేకమై, ముందస్తు సమాచారం సేకరించి పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించి గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు, సిఐలు ఉన్నారు.

మందస : కెజిబివిలో అన్నాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఆహారం విషయంలో అజాగ్రత్త వద్దు

విద్యార్థులకు అందిస్తున్న ఆహారం విషయంలో అజాగ్రత్త వహించవద్దని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి కెజిబివి సిబ్బందికి సూచించారు. మందస మండలంలోని గుడారిరాజమణిపురం సమీపంలోని కెజిబివిని ఆయన శుక్రవారం సందర్శించారు. విద్యాలయంలో కొందరు విద్యార్థినులు అస్వస్థతకు గురికావడానికి గల కారణాలు, ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. విద్యాలయంలోని వంటగది, తరగతి గదులు, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ఆరోగ్య పరిస్థితి బట్టి విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆదేశించారు. విద్యాలయం ఆవరణంలో అదనంగా మరికొన్ని సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. భద్రత, రక్షణపరమైన పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్ఐ కృష్ణప్రసాద్‌కు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులతో మాట్లాడి ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు ఉన్నా నిర్భయంగా తెలియజేయాలన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు. ఎస్‌పి వెంట ఇచ్ఛాపురం, కాశీబుగ్గ రూరల్‌ఐ సిఐలు చిన్నంనాయడు, తిరుపతిరావు, విద్యాలయం అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఉగాది వేడుకలకు ఏర్పాట్లు

డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. విశ్వావసునామ ఉగాది వేడుకల నిర్వహణలో భాగంగా పలు శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశలో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఈనెల 30న వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగువారి సంప్రదాయం ఉట్టిపడే విధంగా మామిడాకుల తోరణాలు, అరటి చెట్లతో అలంకరించాలన్నారు. ఉగాది పచ్చడి, పంచాంగ శ్రవణం నిర్వహించాలని దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. వేడుకలకు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో జిల్లా ఉద్యాన అధికారి ప్రసాదరావు, డిఎస్ఒ జి.సూర్యప్రకాష్, దేవాదాయ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి కె.త్రినాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

IDBI BANK LTD

ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్
రిటైల్ రికవరి, పైడా ఛాంబర్స్, 9-14-15, వి.ఐ.పి రోడ్డు, సిరిపురం, విశాఖపట్నం-530003, ఎ.పి.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద ప్రకటన (SARFAESI చట్టం)

ఋణగ్రహీత మరియు తనఖాదారు: శ్రీ సలావురావు నాగు, సాయి సౌధ అపార్ట్‌మెంట్, గ్రౌండ్‌ఫ్లోర్ నెం.1, కిమ్స్ హాస్పిటల్ దగ్గర, బైరవనిపేట, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్-532001, **మరొక చిరునామా: శ్రీ సలావురావు నాగు,** ప్రొహిబిషన్ & ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్, పాలకొండ, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్-532440, **సహ-ఖాతాదారు: శ్రీమతి సలావురావు శారద,** సాయి సౌధ అపార్ట్‌మెంట్, గ్రౌండ్‌ఫ్లోర్ నెం.1, కిమ్స్ హాస్పిటల్ దగ్గర, బైరవనిపేట, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్-532001.

పైనఉదహరించిన ఋణగ్రహీత(లు) మరియు తనఖాదారులకు ఈ నోటీసు జారీచేస్తూ తెలియజేయునదేమనగా పై ఋణగ్రహీత(లు)కు ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్ (ఐడిబిఐ) వారు **హోమ్ లోన్ నిమిత్తం రూ.15,00,000/- (అక్షరాల పదిహేను లక్షల రూపాయలు మాత్రమే) మరియు ఇన్సూరెన్స్ ప్రీమియం రూ.44,394/- (అక్షరాల నలభైనాలుగు వేల మూడు వందల తొంభైనాలుగు రూపాయలు మాత్రమే) వెరశి మొత్తం రూ.15,44,394/- (అక్షరాల పదిహేను లక్షల నలభైనాలుగు వేల మూడు వందల తొంభైనాలుగు రూపాయలు మాత్రమే)** ఆర్థిక సహాయమును మంజూరు చేసినారు. సదరు ఆర్థిక సహాయము జారీ కొరకు సంబంధించి **శ్రీ సలావురావు నాగు మరియు శ్రీమతి సలావురావు శారద** గార్ల ద్వారా అవసరమైన ఋణ మరియు హామీ దస్తావేజులు ఇవ్వబడినవి. సదరు ఆర్థిక సహాయమును క్రింద తెలిపిన ఆస్తుల టైటిల్ డీడ్‌లు జమ చేయుట ద్వారా తనఖా ద్వారా పొందినారు. పైన తెలిపిన ఋణగ్రహీత లోను అగ్రిమెంట్ **31-12-2020** నందలి నిబంధనలను అనుసరించి బకాయిలు చెల్లింపు విఫలమైనందున భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్‌బిఐ) జారీచేయు మార్గదర్శకాల ప్రకారం ఐడిబిఐ బ్యాంక్ పుస్తకాలలో ఋణగ్రహీతల ఖాతాలను **ది.08-01-2025**న నిరర్థక ఆస్తులు (యన్‌పిఎ)గా వర్గీకరింపబడినవి.

పైన పేర్కొన్న ఋణగ్రహీత బకాయిలు/ వాయిదాలు చెల్లించుటలో అనేకసార్లు విఫలమైనందువలన **ఐడిబిఐ బ్యాంక్ ది.19-02-2025న లెటరు రిఫరెన్స్ నెం.IDBI/SARFAESI 13(2)/421/97809676/03**లో వివరించిన విధంగా **ది.08-01-2025 నాటికి రూ.13,02,149/- (అక్షరాల పదమూడు లక్షల రెండు వేల నూటనలభై తొమ్మిది రూపాయలు మాత్రమే) మరియు సదరు మొత్తానికి ది.09-01-2025 నుండి తదుపరి జమకూడు వడ్డీతో ఋణబకాయి ది.08-01-2025 నాటికి రూ.13,02,149/- (అక్షరాల పదమూడు లక్షల రెండు వేల నూటనలభై తొమ్మిది రూపాయలు మాత్రమే)మొత్తము చెల్లించునాటికి అయ్యే కాంట్రాక్ట్యువల్ వడ్డీతో ఐడిబిఐ బ్యాంక్ వారికి చెల్లించవలసినదిగా శ్రీ సలావురావు నాగు మరియు శ్రీమతి సలావురావు శారద** గార్లకు తెలియజేయడమైనది.

SARFAESI చట్టం యొక్క సెక్షన్13(2) ప్రకారం సదరు ఋణగ్రహీతలు/తనఖాదారు(లు) చిరునామాలకు **"ధృవీకరణతో తిరిగిపొందు రిజిస్టర్డు పోస్ట్" ద్వారా ఐడిబిఐ బ్యాంక్ అవసరమైన నోటీసును జారీచేసినది. అది జారీకాక "చిరునామాదారు సమాచారం ఇవ్వక వెళ్ళినారు. కావున పంపకం దారుకు త్రిప్పి పంపడమైనది". అను పోస్టల్ గమనికతో తిరిగి వచ్చినది.** పై కారణములచే **SARFAESI** రూల్స్ యొక్క రూల్ 3(1) షరతు ప్రకారం ఈ బహిరంగ నోటీసు జారీచేయడమైనది. ఐడిబిఐ బ్యాంక్ ముందస్తు లిఖిత అంగీకారము లేనిదే ఏదేని సెక్యూర్డ్ ఆస్తులను బదలాయించుట లేదా అటువంటి చర్యలు (మీ సాధారణ వ్యాపారమునకు సంబంధించనివి) మీరు చేపట్టరాదని గమనించగలరు. లేనియెడల **SARFAESI** చట్టం యొక్క సెక్షను 29 ప్రకారం మీరు నేరమునకు శిక్షార్హులు కాగలరు.

సదరు చట్టంలో సెక్షన్ 13(8) ప్రకారం ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

ఈ పరిస్థితులలో పైన ఉదహరించిన మొత్తమును ఈ తేదీ నుండి 60 రోజులలోపు చెల్లించవలసినదిగా ఋణగ్రహీతలు/ తనఖాదారు(ల)ను మరోసారి అభ్యర్థించడమైనది. లేనియెడల, తన బకాయిలను రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఐడిబిఐ బ్యాంక్ తన సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ను అమలు పరచుటకు **SARFAESI** చట్టం నిబంధనల ప్రకారమే కాక ఐడిబిఐ బ్యాంక్‌కు అందుబాటులో గల ఏదేని ఇతర చట్టబద్ధ చర్యలు చేపట్టు అధికారము కలదు.

స్థిరాస్తి యొక్క వివరము

(శ్రీమతి సలావురావు శారద పేరున గల తనఖావుంచబడిన స్థిరాస్తి వివరములు)

ఆస్థి నెం.-1: శ్రీకాకుళం జాయింట్ ఎస్.ఆర్.ఓ నందలి ది.06-04-2024న రిజిష్టర్ కాబడిన విక్రయ దస్తావేజు నెం.3288/2021 ప్రకారం)

శ్రీకాకుళం జిల్లా మరియు శ్రీకాకుళం సబ్‌రిజిస్ట్రేషన్ జిల్లా మరియు శ్రీకాకుళం టౌన్, గుజరాతిపేట అలియాస్ హైయతినగరం గ్రామము, పురుషోత్తం నగర్ కాలనీ రోడ్, సర్వే నెం.142/2, డోరు నెంబర్ : 16-16-37 నందు 120 చ॥గ॥లు లేదా 100.2 చ॥మీ॥ల విస్తీర్ణము లోని స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **మొత్తం స్థలమునకు కొలతలు : తూర్పు నుండి పడమరకు :** 18 అ॥లు (లేదా) 5.472 చ॥మీ॥, **ఉత్తరం నుండి దక్షిణంకు :** 60 అ॥లు (లేదా) 18.24 చ॥మీ॥ మొత్తం 120 అ॥లు లేదా 100.2 చ॥మీ॥లు.

మొత్తం స్థలమునకు హద్దులు : తూర్పు : యడ్లపల్లి భాగ్యలక్ష్మి, భర్త : శంకరరావు యొక్క ఖాళీ స్థలము, **దక్షిణం :** అంధవరపు వెంకట ముత్యాలు యొక్క లేఅవుట్, **పడమరకు :** చలపాక అరుణ, భర్త : జగదీశ్వరరావు యొక్క ఆర్.సి.సి. ఇల్లు, **ఉత్తరం :** రోడ్.

వాటిపై ఉన్న ప్రస్తుతం మరియు భవిష్యత్తులో నిర్మాణాలు మరియు నిర్మాణాలన్నింటినీ కలుపుకొని.

తేది : 29-03-2025
ప్రదేశం: శ్రీకాకుళం

సం/- అధీకృత అధికారి & డిప్యూటీ జనరల్ మేనేజర్, ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్.

ఇరిగేషన్ అధికారులపై కేసులు ఉపసంహరణ

ప్రజాశక్తి - పొందూరు, ఆమదాలవలస

పొందూరు మండలం తాడివలస వద్ద రెల్లిగెడ్డ అభివృద్ధి పనుల్లో నిబంధనలు ఉల్లంఘించారని 2023లో అప్పటి వైసిపి ప్రభుత్వం ఐదుగురు ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్‌పై నమోదు చేసిన క్రిమినల్ కేసులను కూటమి ప్రభుత్వం ఎత్తివేసింది. లైదాం నుంచి సింగూరు వరకూ గల రెల్లిగెడ్డ ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరందించాలనే సంకల్పంతో 2018లో టిడిపి ప్రభుత్వం హయాంలో సుమారు రూ.7.94 కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టారు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులను పూర్తిగా నిలిపివేశారు. 2020లో వచ్చిన భారీ వర్షాలకు రెల్లిగెడ్డలో వరదనీరు పోటెత్తడంతో తాడివలస వద్ద చెక్‌డ్యాం కొట్టుకుపోయింది. దీంతో పనులు నాసిరకంగా ఉన్నాయని అప్పటి ప్రభుత్వం విజిలెన్స్ అధికారులతో విచారణ అనంతరం 2021 ఫిబ్రవరి 25న కేసు నమోదు చేసింది.

ఇరిగేషన్ ఎఇ డి.వి.రమణ, డిఇఇలు కె.వి క్రాంతి, శ్రీరంగనాయకులు, ఇఇ బి.రవీంద్ర, ఎస్ఇ టి.వెంకటశేషగిరిరావుతో పాటు కాంట్రాక్టర్‌పై 2023 ఆగస్టు 7వ తేదీన క్రిమినల్ కేసులు పెట్టడంతో పాటు అధికారులను సస్పెండ్ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేసును పున:పరిశీలించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం కేసులను ఎత్తివేస్తూ ప్రత్యేక జిఒను జారీ చేసింది. అధికారులపై నమోదైన కేసులను ఎత్తివేయడంతో రెల్లిగెడ్డలో పనులకు గ్రీన్‌సిగ్నల్ లభించినట్లయింది. త్వరలో పనులు పూర్తి చేసి, రెల్లిగెడ్డలో వరదనీటిని నిల్వ చేయడం ద్వారా రెండు పంటలకు సరిపడా సాగునీరందిస్తామని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు.

వినతిపత్రాన్ని అందజేస్తున్న యూనియన్ నాయకులు, అంగన్వాడీలు

ఫేస్ యాప్ పేరుతో వేతనాల్లో కోత

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఫేస్ యాప్ పేరుతో అంగన్వాడీల వేతనాల్లో కోత విధించవద్దని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ కోరారు. అంగన్వాడీలకు ఏడు నెలల నుంచి మూడేళ్ల పిల్లల తల్లులకు ప్రతినెలా ఫేస్ ఎన్‌రోల్‌మెంట్ చేయాలని ఇచ్చిన ఆదేశాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించు కోవాలన్నారు. ఐసిడిఎస్ జిల్లా కార్యాలయంలో పీడీ బి.శాంతిశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఫేస్ యాప్ సరిగా పనిచేయక, దీనికితోడు సాంకేతిక సమస్యలు, ప్రభుత్వం ఇచ్చిన మొబైల్ ఫోన్లు సరిగా పనిచేయకపోవడం వంటి సమస్యలు ఉన్నాయన్నారు.

ఏడు నెలల నుంచి మూడేళ్ల పిల్లల తల్లులకు ఫేస్ ఎన్‌రోల్‌మెంట్ చేయలేదని సోంపేట, కోటబొమ్మాళి ప్రాజెక్టుల్లో అంగన్వాడీ వర్కర్లకు రెండు రోజుల నుంచి వారం రోజుల వేతనాలు కోత విధిస్తున్నట్లు అధికారులు బెదిరిస్తున్నారని.. శ్రీకాకుళం, కొత్తూరు, టెక్కలి ప్రాజెక్టుల్లో మెమోలు జారీ చేశారంటూ తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. వేతనాలు కోత విధిస్తే పోరాడేందుకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ప్రభుత్వం పనిచేసే నాణ్యమైన 5జి ఫోన్లు అంగన్వాడీలకు ఇవ్వాలని, సమ్మె సందర్భంగా నిర్వహించిన మినిట్స్ కాపీ ఒప్పంద జిఒలు ఇచ్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ జిల్లా నాయకులు ఎన్.హైమావతి, వి.హేమలత, జె.కాంచన, డి.మోహిని, పి.బాలేశ్వరి, ఎల్.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస పురపాలక సంఘం

రేఖా సంఖ్య.671/ఎ/2024-జి1. **పత్రికా ప్రకటన** తేది.28.03.2025

గౌరవ డైరెక్టర్ & పట్టణ ప్రణాళికా సంచాలకులు, మంగళగిరి వారి సర్క్యులర్ Bo. Lr. Roc No.17/08/2022-PLG, Dt. TCP Dt.13.08.2024 మరియు శ్రీయుత ప్రాంతీయ ఉప సంచాలకులు, టౌన్ & కంట్రీ ప్లానింగ్ వారి ద్వారా Lr. Roc No.349/2020/2, Dt.14.08.2024 వారి సర్క్యులర్ అనుసరించి, శ్రీకాకుళం జిల్లా, ఆమదాలవలస పురపాలక సంఘంలోగల వీధులలో రహదారుల వెడల్పు తక్కువగా ఉండి జనసాంద్రత మరియు నిర్మాణముల సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతములలో భవన నిర్మాణ అనుమతులు పొందుటకు గాను సంబంధిత భవన నిర్మాణ యజమానులకు కష్టతరముగా ఉన్నదని, ఇందుపై శ్రీయుత సంచాలకులు, టౌన్ & కంట్రీ ప్లానింగ్ వారి యొక్క ఉత్తర్వులను అనుసరించి ఇందుపై సంబంధిత ప్రాంతములకు (ఏరియాలకు) సర్క్యులేషన్ నెట్వర్క్ ప్లానులు తయారుచేసి ఆమోదము పొందిన ఎడల ప్లానులకు అనుమతులు ఇచ్చుటకు వీలు అగునని తెలిపియున్నారని, అందువలన సర్క్యులేషన్ నెట్వర్క్ ప్లానుల తయారు చేయించి (Competent Authority, RDDTP) వారి వద్ద ఆమోదము పొందిన ఎడల ఆమదాలవలస మునిసిపాలిటీ భవన యజమానులకు, భవన నిర్మాణ అనుమతులను పొందు విషయమై వెసులుబాటు కలుగుతుంది.

ప్రస్తుతము ఆమదాలవలస పురపాలక సంఘంలో చాలా ప్రాంతాలు చిన్నదారులు మరియు పాత నిర్మిత ప్రాంతాలలో 9మీ (30 అడుగుల) కంటే తక్కువ వెడల్పుగల రోడ్లతో కూడుకుని ఉన్నాయి. సదరు స్థలములో భవనము ఎత్తు 10మీ (G+2 Floor) మించకుండా ఉండునట్లు మరియు మాస్టర్ ప్లాన్, రహదారి తప్ప మిగిలిన చిన్న రహదారులను వాటి ప్రస్తుత రోడ్డు వెడల్పులను 30 అడుగులు కన్నా తక్కువ ఉంటాయి. అటువంటి భవనాలకు / స్థలాలకు నూతన భవన నిబంధనలు మేరకు 30 అడుగుల వరకు రోడ్డు భాగమును సంబంధిత పురపాలక సంఘం అనగా ఈ ఆమదాలవలస పురపాలక సంఘమునకు ఉచితముగా అందజేయవలసి ఉండేది. ప్రస్తుతము అందుకు ఉపశమనం కోసమై ఈ పురపాలక సంఘం పరిధిలో 87 ప్రాంతాలలో కూడిన 31 సంఖ్యలుగల సర్క్యులేషన్ నెట్వర్క్ ప్లానులు GIS సాఫ్ట్వేర్ నందు తయారుచేయడం జరిగింది.

కావున ఆమదాలవలస పురపాలక సంఘంలో గల పట్టణ ప్రణాళికా విభాగము వారు సర్వే చేసి గుర్తించి తయారుచేసిన ప్రతిపాదనలు గౌరవ ప్రాంతీయ ఉప సంచాలకులు, టౌన్ & కంట్రీ ప్లానింగ్ ఆఫీసర్, విశాఖపట్నం వారిచే ఆమోదము పొందిన 87 ప్రాంతాలతో కూడిన 31 సంఖ్యలుగల సర్క్యులేషన్ నెట్వర్క్ ప్లానులు ఈ కార్యాలయము నందు మరియు సంబంధిత సచివాలయ కార్యాలయాలలో నోటీసు బోర్డు నందు అందుబాటులో ఉంచడమైనది. దీనిపై ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల 7 రోజులలో మీ యొక్క అభ్యంతరములు ఈ పురపాలక సంఘము కార్యాలయమునకు లికిత పూర్వకముగా తెలియ చేయవలసినదిగా తే 12.03.2025 దిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయడము జరిగినది నేటి వరకు యెటువంటి అభ్యంతరములు రాలేదు కావున ఆమదాలవలస పురపాలక సంఘంలో గల పట్టణ ప్రణాళికా విభాగము వారు సర్వే చేసి గుర్తించి తయారుచేసిన ప్రతిపాదనలు గౌరవ ప్రాంతీయ ఉప సంచాలకులు, టౌన్ & కంట్రీ ప్లానింగ్ ఆఫీసర్, విశాఖపట్నం వారిచే ఆమోదము పొందిన 87 ప్రాంతాలతో కూడిన 31 సంఖ్యలు గల సర్క్యులేషన్ నెట్వర్క్ ప్లానులును ఖరారు చేయడమైనదని తెలియజేయడమైనది

సం/- కమిషనర్, ఆమదాలవలస పురపాలక సంఘం

ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎస్‌పి

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

పలాస: ప్రజా ఫిర్యాదులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి కాశీబుగ్గ సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులను ఆదేశించారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు విన్న ఎస్‌పి సానుకూలంగా స్పందించి, వారి సమస్యలపై పూర్తి స్థాయి విచారణ జరిపి పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. తక్షణమే ఆయా ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు తెలిపి పరిష్కారం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్, కుటుంబ కలహాలు, ఆస్తి, కొట్లాట, మిస్సింగ్, ఇతరత్రా అంశాలపై ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ యూనియన్ నాయకుడు తాడి సంతోష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో మేనేజర్ భిసోయ్ లక్ష్మీనారాయణకు మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల మస్టర్ పాయింట్‌ను మూడుచోట్ల పెట్టడంతో వేకువజామున విధులకు వెళ్లే సమయంలో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మేనేజర్ దృష్టికి తీసుకువచ్చారు. గతంలో మాదిరిగా మస్టర్ పాయింట్‌ను ఒకచోట ఏర్పాటు చేసి హాజరు వేయాలని కోరారు. పనిముట్లు, బండి పారలు, కాలువ పారలు, చెత్త డ్రమ్‌లు వంటి పరికరాలను కార్మికులకు అందజేయాలని కోరారు. పురపాలక సంఘం పరిధి పెరుగు తుండడంతో కార్మికులపై పనిభారం పెరుగుతుందని, విధుల్లోకి కొత్త వారిని తీసుకుని పని భారాన్ని తగ్గించాలని కోరారు. జిఒ 279 ప్రకారం 2018లో తొమ్మిదిమంది కార్మికుల ఇపిఎఫ్ చెల్లించలేదని ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ఎన్.రాజేష్, ఎ.శ్రీనివాస్, కె.తారక, జె.శ్రీను, కె.ఈశ్వరరావు, డి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్న గోపీబాల

నిధుల దుర్వినియోగం ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అక్కుపల్లి పంచాయతీ నిధులు దుర్వినియోగమైనట్టు ఫిర్యాదు అందడంతో డివిజనల్ పంచాయతీ అధికారి ఆర్.గోపీబాల, మండల పంచాయతీ అధికారి డి.తిరుమలరావుతో కలిసి శుక్రవారం అక్కువల్లి సచివాలయంలో విచారణ చేపట్టారు. 2021 నుంచి ఇప్పటివరకు నిధుల వినియోగంపై కార్యదర్శుల నుంచి వివరాలు సేకరించారు. పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలన చేపడతానని పేర్కొన్నారు. ఆదాయం, ఖర్చులపై ఓచర్లు తనిఖీ చేయాల్సి ఉందన్నారు. 20 రోజుల్లో నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి అందిస్తా మన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషాకు గ్రామస్తుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్‌కు పంపగా జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు విచారణ చేపడుతున్నట్లు డిఎల్‌పిఒ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లండ వనజాక్షి, మాజీ సర్పంచ్ లండ రామలింగం, మండల టిడిపి అధ్యక్షులు సూరాడ మోహనరావు, శ్రీరామసేవా సంఘం అధ్యక్షులు మోస వరప్రసాద్. సింగుపల్లి బాలకృష్ణ, డిఎల్‌పి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఉమాపతి ఉన్నారు.

ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజా సమస్యలపై స్పందించాలి

శ్రీకాకుళం అర్బన్: నగరంలో ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, వాటిని పరిష్కరించేందుకు నగరపాలక సంస్థ ఉద్యోగులు పూర్తి సహకారాన్ని అందించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. విభాగాల వారీగా సందర్శించిన ఆయన ప్రజల నుంచి స్వీకరించిన వినతులను విభాగాల ఇన్‌ఛార్జిలకు అప్పగించారు. మున్సిపల్ పరిధిలో ప్రజలకు అనేక సమస్యలుంటాయని, తాగునీరు, పారిశుధ్యం, ఆరోగ్య సమస్యలు తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, సమస్యలపై ప్రజలు వస్తే అధికారులు సానుకూలంగా స్పందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, హెల్తాఫీసర్ డాక్టర్ పొట్నూరు సుధీర్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

కిడ్నీ ఆస్పత్రికి అంబులెన్స్



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న బాబూరావు

పలాస: పలాస కిడ్నీ ఆస్పత్రికి గ్లో స్వచ్ఛంద సేవాసంస్థ కార్యదర్శి, టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి తన పుట్టినరోజు సందర్భంగా అంబులెన్సును శుక్రవారం అందజేశారు. ఈ అంబులెన్స్‌ను ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి నాయకులు, గ్లో ప్రతినిధులతో కలిసి ఆస్పత్రి ఆవరణలో ప్రారంభించారు. ఇప్పటికే ఆ సంస్థ నుంచి కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం తన సొంత నిధులతో మూడు డయాలసిస్ యూనిట్లు అందజేయగా మరో ఏడు డయాలసిస్ యూనిట్లు వివిధ సంస్థలతో అందజేశారు. తన మిత్ర బృందమైన ఎన్ఆర్ఐ వైద్యుల సాయంతో కొన్ని డయాలసిస్ యూనిట్లను అందజేసి ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై చిత్తశుద్ధిని ప్రదర్శించారు. ప్రతి సందర్భంలోనూ ప్రజోపయోగ కార్యక్రమాలు చేపడుతూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బడ్డ నాగరాజు, లోడగల కామేష్, గాలి కృష్ణ, దువ్వాడ శ్రీకాంత్, చిన్ని, కె.శంకర్, కొండె నరసింహ, త్యాడి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

‘పోరుబాట’ను విజయవంతం చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం అర్బన్ : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కిశోర్

విద్యారంగం - ఆర్థిక రంగం సమస్యల సాధన కోసం యుటిఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పోరుబాట సదస్సును ఈ నెల 31న శ్రీకాకుళంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సదస్సు కోసం యుటిఎఫ్ ఉత్తరాంధ్ర నాయకత్వ సన్నాహక సమావేశం రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు అధ్యక్షతన జూంలో నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఒ 117ను రద్దుచేసి దానికి ప్రత్యామ్నాయంగా ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు, ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులకు దూరం చేసేవిగా, పాఠశాల సంఖ్య తగ్గించేదిగా ఉన్నాయని, 12 వేలకుపైగా ఉన్న ఏకోపాధ్యాయ పాఠశాల సంఖ్య ఇంకా పెరిగి 20 వేలకు చేరేలా ఉన్నాయన్నారు. మోడల్ ప్రాథమిక పాఠశాల పేరుతో 3,4,5 తరగతుల తరలింపు వల్ల ప్రాథమిక పాఠశాలలు కుదింపు, యుపి పాఠశాలను, హైస్కూల్, ఫ్లస్ 2 డౌన్ గ్రేడ్ చేయడం వల్ల 6,7,8 తరగతుల విద్యార్థులు విద్యకు దూరమై డ్రాపౌట్సుగా మిగిలిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లస్2 తరగతుల రద్దు వల్ల కాలేజీ విద్యకు పేదవిద్యార్థులు దూరమవు తారన్నారు. విద్యను ప్రైవేటు కాలేజీల్లో కొనుక్కోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వాల చర్యలతో పది లక్షలమంది విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లకు మారి ఆర్థికభారాన్ని మోస్తున్నారన్నారు. రాష్ట్రంలో 34 లక్షల మంది పభుత్వ పాఠశాలల్లో ఉన్నారని, ఈ సంస్కరణ వల్ల ఇంకా తగ్గే ప్రమాదం ఉందన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో 5 తరగతులు, 5 మంది ఉపాధ్యాయులు, 5 తరగతి గదులతో, విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని, ప్రాథమికోన్నత పాఠశాలను, ఫ్లస్-2 పాఠశాలను ప్రభుత్వం కొనసాగించాలన్నారు. ఈ అంశాలతో పాటు ఉద్యోగ, ఉపాధ్యా యులకు గత ప్రభుత్వం 11వ పిఆర్‌సి ఎరియర్లు, డిఎ, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, మెడికల్ బిల్లు, సరెండర్ లీవ్ వంటి ఉద్యోగుల దాచుకున్న డబ్బులు చెల్లించకుండా రూ.25 వేల కోట్లుపైగా బకాయిలు పెట్టిందని, ఇప్పుడు అవి రూ.30 వేల కోట్లకు చేరాయన్నారు. కూటమి ప్రభుత్వం అరకొరగా బకాయిలు చెల్లించినప్పటికి ఇంకా రూ.20 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. మరోవైపు 12వ పిఆర్‌సి చైర్మన్ రాజీనామా తర్వాత కొత్త చైర్మన్ నియమించలేదని, ఐఆర్ 30 శాతం చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో చేపట్టనున్న పోరుబాట సదస్సులో చర్చించనున్నట్టు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.శ్రీరామ్మూర్తి, లండ బాబూరావు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

టెక్కలి: కూటమి ప్రభుత్వంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తుందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు అన్నారు. టెక్కలిలో ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సుకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సులో సహాధ్యక్షులు కురమాన దాలయ్య, మండలశాఖ అధ్యక్షులు పి.గణపతిరావు, కార్యదర్శి తమ్మినేని వైకుంఠరావు, జిల్లా కార్యదర్శి జి.నారాయణరావు, సీనియర్ నాయకులు పాలవలస ధర్మారావు, కె.కుమారస్వామి, వై.గణపతిరావు, బాలక శంకరరావు, డి.గణపతిరావుతో పాటు టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నందిగాం మండలాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- పలాస

మండలం రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా కాశీబుగ్గ ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సత్యసాయి విద్యావిహార్ ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు తెలిపారు. ప్రతిఒక్కరు రక్తదానం చేసి మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా సోమశేఖర్ రెడ్డి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.సోమశేఖర్ రెడ్డి, జీరు కామేష్, కోశాధికారిగా అర్.దేవరాజు రెడ్డి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి బార్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఎఎంసి చైర్మన్‌గా ‘మల్లా’



పలాస: పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మల్లా శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు విధేయుడైన శ్రీనివాసరావును రెండోసారి ఆ పదవి వరించింది. ఆయన 2015 నుంచి 2020 వరకు ఎఎంసి చైర్మన్‌గా పనిచేశారు. శ్రీనివాసరావు ప్రస్తుతం జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం (పిసిఎంఎ) అధ్యక్షునిగా ఉన్నారు. గతంలో టిడిపి సమన్వయ కమిటీ కార్యదర్శిగా, ఖుర్దా డివిజన్ రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యునిగా పనిచేశారు. అనేక పార్టీ పదవులు నిర్వహించారు. తనకు పదవి ఇవ్వడానికి కృషి చేసిన ఎమ్మెల్యే గౌతు శిరీష, యార్లగడ్డ వెంకన్నచౌదరి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు తదితరులుకు కృతజ్ఞతలు తెలిపారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

టెక్కలి: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల్లో కూడా మార్పులు రావాలని సమయాన్ని సద్వినియోగం చేసుకున్న వారు విజయాన్ని సాధిస్తారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అన్నారు. కళాశాల ఆవరణలో శుక్రవారం డిగ్రీ సైన్స్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని కోరారు. కళాశాలలో ఉన్న ఆంతర్జాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్ కుమార్, వాసుబాబు, కోటేశ్వరరావు, డాక్టర్ పివిఎన్ ఆచార్యులు, వైవిసిహెచ్ లీలాపద్మజ, సుగుణాకరరావు, రాంబాబు, త్రినాథరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సొంత నిధులతో అభివృద్ధి

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 23 వార్డు బెల్లుపడ కాలనీలో వార్డు కౌన్సిలర్ గువ్వాడ ప్రదీప్ తన సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. వార్డులో కాలువలపై కవర్ స్లాబ్‌లు ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో వార్డులో ప్రజల ఇబ్బందులు గమనించిన కౌన్సిలర్ తన సొంత నిధులు వెచ్చించి కవర్ స్లాబ్‌లు ఏర్పాటు చేశారు.

ఇన్‌ఛార్జి వార్డెన్‌కు హెచ్చరిక లేఖ

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు బిసి హాస్టల్ ఇన్‌ఛార్జి వార్డెన్ జోస్యల రమేష్‌బాబుకు గుర్తు తెలియని ఇద్దరు యువకులు మోటార్ సైకిల్‌పై వచ్చి ఓ హెచ్చరిక లేఖను హాస్టల్ విద్యార్థులకు ఇచ్చి వెళ్లిన విషయం వెలుగులోకి వచ్చింది. వార్డెన్ రమేష్‌బాబు లావేరు మండలం మెట్టవలస బిసి హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తూ లావేరు ఇన్‌ఛార్జి వార్డెన్‌గా గత రెండేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈనెల 25న మధ్యాహ్నం 3.15 గంటల సమయంలో ఇద్దరు యువకులు మోటార్ సైకిల్‌పై లావేరు హాస్టల్ గేట్ దగ్గరకు వచ్చి అక్కడ వున్న విద్యార్థులకు ఈలెటర్ వార్డెన్‌కు ఇచ్చేయమని చెప్పి అక్కడ నుంచి వారు వెనుతిరిగి వెళ్లిపోయారు. ఆ లెటర్‌ను విద్యార్థులు హాస్టల్ అటెండర్‌కి ఇవ్వగా ఆ సమయంలో మెట్టవలస హాస్టల్లో ఉన్న వార్డెన్ రమేష్ బాబుకు ఫోన్‌లో ఇద్దరు వ్యక్తులు వచ్చి లెటర్ ఇచ్చి వెళ్లారని చెప్పడంతో వెంటనే వచ్చి లెటర్ విప్పి చదవగా రమేష్ మాస్టర్ మీరు మరలా కె మత్స్యలేశం వస్తారని తెలిసింది. సంతోషం అయితే మీరు మూడు హాస్టళ్లు చూడడం కరెక్ట్ కాదు. కావున మా రాముడు మాస్టర్‌కు లావేరుగాని కె.మత్స్యలేశంగాని ఇన్‌ఛార్జి ఇప్పించండి. డిబిసిడబ్ల్యుఒ మీ మాట వింటారు కాబట్టి రాముడు మాస్టర్‌కు ఇన్‌ఛార్జి ఇప్పించే బాధ్యత మీదే. లేకపోతే మీరు ఎక్కడ పని చేయలేరు, చెయ్యనివ్వమని, కాబట్టి పూర్తి బాధ్యత తీసుకుని ఏదో ఒక హాస్టల్ మా రాముడుకు ఇప్పించండి లేదంటే తర్వాత పరిణామాలకు మీరే బాధ్యలు అంటూ హెచ్చరిక లెటర్‌లో టైప్ చేసి లెటర్ కవర్లో పెట్టి కవర్‌పై వార్డెన్ అడ్రస్, ఫోన్ నెంబర్ రాసి ఇచ్చారు. దీనిపై వార్డెన్ లావేరు ఎస్ఐ జి.లక్ష్మణరావుకు ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే లెటర్ ఇచ్చి వెళ్లిన యువకుల బైక్ లావేరు కూడలిలో వున్న సిసి కెమెరాల్లో రికార్డు అయినట్లు, ఆ పుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నట్లుగా తెలుస్తుంది. కాగా ఆ లెటర్ అదే డిపార్ట్‌మెంట్‌కు చెందిన వారే బెదిరింపు లెటర్ రాసినట్లుగా పోలీసులు కొలిక్కి వచ్చినట్టుగా విశ్వసనీయ సమాచారం ఏమి జరుగుతోందో చూడాలి.

రూ.90 లక్షలతో మంచినీరు సరఫరా

ప్రజాశక్తి- పలాస

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు, మహిళలు

మండలం శాసనంలో గ్రామస్తులు, మహిళలు శుక్రవారం ఎమ్మెల్యే గౌతు శిరీష చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండలం శాసనంలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకువచ్చారు. 24 గంటల వ్యవధిలో ఎమ్మెల్యే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో చర్చించి గ్రామానికి తాగునీరు సరఫరా చేసేందుకు రూ.90 లక్షలు మంజూరు చేశారు. దీంతో శాసనాం గ్రామస్తులు, మహిళలు గ్రామంలో ఎమ్మెల్యే శిరీష చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు డల్లి ప్రసాదరావు, కుప్పిలి కామరాజు, డల్లి జయరాం మాట్లాడుతూ ఎన్నోఏళ్ళుగా గ్రామంలో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డామని, సమస్య చెప్పిన 24 గంటల్లో రూ. 90 లక్షల వ్యయంతో మంచినీటి పథకాన్ని మంజూరు చేయడం గొప్ప విషయమన్నారు. అంతే కాకుండా గ్రామంలో రూ.18 లక్షల వ్యయంతో ఎమ్మెల్యే చొరవతో సిసిరోడ్లు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. గ్రామానికి నిధులు మంజూరు చేయడం, మంచినీటి పథకాన్ని మంజూరు చేయడంపై ఎమ్మెల్యేకు గ్రామస్తులు, మహిళలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కొత్త ధర్మారావు, కొయ్య కామరాజు, పుచ్చకాయల సింహాచలం, సీరపు ఉమేష్, పరపటి చంటి, నీలాపు శ్రీనివాసరావు, నీలాపు ప్రసాదరావు, బి.తిరుపతి, కె.దానయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులంటే లెక్క లేదా..?

ఎంపిడిఒపై సభ్యుల మండిపాటు

మండల సమావేశంలో పాల్గొన్న ఎంపిటిసిలు, అధికారులు

ప్రజాశక్తి- బూర్జ

ప్రజలచే ఎన్నుకోబడిన సభ్యులపై ఎంపిడిఒ నిర్లక్ష్య వైఖరి వ్యవహరించడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని ఎంపిపి కర్నెన దీప, జెడ్‌పిటిసి బి.రామారావులు ప్రశ్నించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దీప ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె ప్రశ్నించారు. మండల పరిషత్‌లో జరుగుతున్న పనులు విషయంలో నామమాత్రానికైనా ఎంపిపికి ఇతర సభ్యులకు కనీస సమాచారం ఇవ్వడం లేదన్నారు. మండల అభివృద్ధికి మండలంలోని అన్ని గ్రామాల్లో జరగనున్న పనులపై ఎంపిడిఒ ఎంపిపి, జెడ్‌పిటిసి, ఇతర ఎంపిటిసి సభ్యులను సంప్రదించక పోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని ఎంపిడిఒ తిరుపతిరావును నిలదీశారు. మండల పరిషత్‌కు వచ్చిన నిధుల విషయంలోనూ, చేస్తున్న అభివృద్ధి పనుల్లో తీర్మానాలను సభ్యులను సంప్రదించ కుండా పనులు ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. మామిడివలస ఎంపిటిసి గుమ్మిడి రాంబాబు మాట్లాడుతూ తోటవాడలో కొంతమంది పింఛన్లను తొలగించారని ఎంపిడిఒను ప్రశ్నించారు.

అనంతరం 2025-26 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను సభ్యులు తీర్మానం చేశారు. ప్రారంభం నిల్వ రూ.70.43043, ఆదాయం 40,84,02500, మొత్తం 50,55,440, రూపాయలు రాగా, వ్యయం 40,83,34,500, ముగింపు నిల్వ 71,30,46 కేటాయించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో వైసిపి మండల అధ్యక్షులు కె.గోవిందరావు, వైస్ ఎంపిపిలు బి.సూర్యారావు, కరణం కృష్ణం నాయుడు, ఎంపిటిసిలు శ్రీరామ్మూర్తి, మజ్జి నరసింహామూర్తి, సుధాకర్‌తో పాటు ఎఒ శ్రీనివాసరావు, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసు ఎప్పుడు ఛేధిస్తారు..?

పోలీస్ స్టేషన్ వద్ద మాజీ మంత్రి సీదిరి బైఠాయింపు

పలాస: మండలం చిన్న నీలావతికి చెందిన తెప్పల ఢిల్లీరావు హత్యకు గురై సుమారు రెండు నెలలు కావస్తున్నా హత్యకేసులో ఎటువంటి పురోగతి లేదని, హత్య కేసును ఎప్పుడు ఛేధిస్తారో తక్షణమే చెప్పాలంటూ మృతుడు భార్య కమలతో పాటు ప్రజా సంఘ నాయకులు, మంత్రి అనుచరులతో కలిసి మాజీమంత్రి సీదిరి అప్పలరాజు కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం బైఠాయించారు. మండలం చిన్ననీలావతికి చెందిన ప్రజాహక్కుల సంఘాల నాయకుడు తెప్పల ఢిల్లీరావు రెండు నెలల క్రితం అనుమాస్పదంగా మృతి చెందినా నేటికి పోలీసులు ఈ కేసును ఛేధించకుండా తాత్కారం ఎందుకు చేస్తున్నారని అప్పలరాజు, మృతుని భార్య కమల, ప్రజాహక్కుల సంఘాల నాయకులు స్టేషన్ ముందు బైరాయించి నినాదాలు చేశారు. ఈ క్రమంలో కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అపారావు, కాశీబుగ్గ రూరల్, సోంపేట సిఐలు పి.సూర్యానారాయణ, మంగరాజు, తిరుపతి అక్కడకు చేరుకొని స్టేషన్ ముందు బైఠాయించడం సరైన పద్ధతి కాదన్నారు. దీనిపై మాజీ మంత్రి డిఎస్‌పి, సిఐతో వాగ్వాదానికి దిగారు. దీనిపై డిఎస్‌పి, సిఐలు మాట్లాడుతూ కొన్ని కేసులు వెంటనే ఛేదించలేమని, నెలలు, సంవత్సరాలు సమయం పడుతుందని, దీనిని రాజకీయం చేయడం సరికాదన్నారు. తాము రాజకీయం చేయడం లేదని, తాము వైసిపి కండువాలు వేసుకొని రాలేదని, ప్రజాసంఘాల నాయకులు, మృతుని భార్యతో కలిసి వచ్చి ఆందోళన చేస్తే పోలీసులే దీనిని రాజకీయ రంగుపులు పులుముతూ రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఎస్‌పి గ్రీవెన్స్‌లో కలిసి ఆయనతో మాట్లాడి, వినతిపత్రం అందించాలని వచ్చామన్నారు. స్టేషన్ వద్ద ఆందోళన చేయడం చట్టానికి విరుద్ధమన్నారు. అయితే ఎప్పటిలోగా కేసును ఛేధిస్తారో తమకు చెప్పాలని దీనిపై ఎస్‌పి మహేశ్వర రెడ్డితో మాట్లాడిన తరువాతే తాము వెళ్తామని చెప్పడంతో దీంతో డిఎస్‌పి అయితే స్టేషన్ లోపలకు వచ్చి కూర్చోవాలని మాజీ మంత్రి, అనుచరులను పిలిచి లోపల కూర్చోబెట్టారు. కేసును నెలరోజుల్లో ఛేధిస్తామని అప్పటికీ తాము చేయలేకపోతే మీరు వచ్చి ఆందోళన చేసుకోవచ్చని డిఎస్‌పి హామీ ఇవ్వడంతో స్టేషన్ నుంచి వెనుదిరిగారు.

విద్యావంతులను చేయడంలోనే సంతృప్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మోహనరావు

పేద, మధ్యతరగతి విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దడం ఎంతో సంతృప్తి నిచ్చిందని మున్సిపల్ హైస్కూల్ బయాలజీ, ఉపాధ్యాయులు దొంతం శెట్టి మోహన్ రావు అన్నారు. మార్చి నెలాఖరున ఉద్యోగ విరమణ గావించనున్న మోహనరావు ‘ప్రజాశక్తి’తో మాటాడారు. అప్పటి శ్రీకాకుళం జిల్లా రాజాం మండలం రాజాంలో దొంతం శెట్టి ముఖలింగం, రాజేశ్వరి దంపతులకు 3వ సంతానంగా మోహనరావు 1963 మార్చి 15న జన్మించారు.

విద్యాభ్యాసం

రాజాంలో 1968లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం ప్రారంభించారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు రాజాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివాను. 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు రాజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి, 1979లో 10వ తరగతి ఉత్తీర్ణత సాధించారు. 1979 నుంచి 1981 వరకు రాజాం గవర్న మెంట్ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్య పూర్తి చేశారు. 1981 నుంచి 1984 వరకు శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్‌లో చదివి, డిగ్రీ పట్టా పొందారు. విజయ నగరం మహరాజా బిఇడి కళాశాలలో 1987లో బిఇడి పూర్తి చేశారు.

ఉద్యోగ జీవితం

1991లో శ్రీకాకుళంలోని గుజరాతిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 1991 నుంచి 2005 వరకు 14 ఏళ్లఉపాధ్యాయునిగా సేవలు అందించి, 2005లో వరం మున్సిపల్ హైస్కూల్‌కు బదిలీపై వచ్చారు. అప్పటి నుంచి 2025 మార్చి నెలాఖరి వరకు అక్కడే బయాలజీ ఉపాధ్యాయునిగా విద్యార్థులకు విద్యాబోధన చేసినట్లు ఆయన తెలిపారు. 34 ఏళ్ల ఉద్యోగ జీవితంలో విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దడంతో పాటు మున్సిపల్ కార్యాలయం విద్యా విభాగంలో ఏడు హైస్కూళ్లలో, 28 ప్రాథమిక పాఠశాలల్లో ఉద్యోగులకు సర్వీస్ రికార్డులు రాసి, వారి జీతభత్యాలు స్వయంగా రాయడం సంతృప్తిని చ్చిందని మోహనరావు అన్నారు. ఉపాధ్యాయ సంఘాల నేతగా సేవలందించానని వివరించారు.

కుటుంబ నేపథ్యం

భార్య: హైమావతి, పెద్ద కుమార్తె భావన, అల్లుడు సంతోష్ దీపక్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, చిన్న కుమార్తె లోచన, చిన్నల్లుడు ఉదయ్ కుమార్ ప్రైవేటు ఉద్యోగి, కుమారుడు లోహిత్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. మనమరాళ్లు ఆద్య ఉన్నారు.

శేష జీవితం

తమ హెచ్ఎం ఇందిరా మణి సూచనల మేరకు వరం మున్సిపల్ స్కూల్‌లో తనసేవలు అందించేందుకు సిద్ధంగా ఉంటానన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పర్లాకిమిడి

గజపతి జిల్లా కాశీనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో పురిటిగూడకు చెందిన గంగాడ కృష్ణ కుమారుడు గంగాడ శంకరరావు రైలుకింద పడి దుర్మరణం చెందాడు. శంకరరావు పార్వతీపురంలో డీజిల్ మెకానిక్ దుకాణం పెట్టుకొని జీవిస్తున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. రైల్వే లైన్ ప్రక్క నుంచి నడుస్తూ అదుపు తప్పి రైలు కింద పడి దుర్మరణం చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని రైల్వే అధికారులు పోస్ట్ మార్టం నిమిత్తం పర్లాకిమిడి సమూహ ఆస్పత్రికి తరలించారు.

నిందితుడిని ప్రవేశపెట్టిన సిఐ, ఎస్ఐ

గంజాయితో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని గొప్పిలి వద్ద అక్రమంగా తరలిస్తున్న గంజాయితో వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.రమేష్ బాబు శుక్రవారం తెలిపారు. గొప్పిలి గ్రామానికి చెందిన బైపోతు యువరాజు వద్ద కేజీ 250 గ్రాముల గంజాయి కలిగి ఉండడంతో గురువారం రాత్రి పట్టుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాతపట్నం సిఐ రామారావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ ఎఇకి దువ్వాడ బెదిరింపు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి విద్యుత్ ఎఇని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ బెదిరించినట్లు శుక్రవారం సాయంత్రం ఒక వీడియో కలకలం రేపింది. దువ్వాడ శ్రీనివాస్ నివాసం విద్యుత్ బిల్లు చెల్లించలేదని, అందుకే విద్యుత్ నిలుపుదల చేశామని, విద్యుత్ బిల్లులు చెల్లించిన వెంటనే విద్యుత్ పునరుద్ధరణ చేశామని ఎఇ మురళీకృష్ణ తెలిపారు. అయితే వారంరోజుల క్రితమే విద్యుత్ బిల్లులు చెల్లించామని అయినప్పటికీ కావాలనే దురుద్దేశంతో నిలుపుదల చేశారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు.

పాడి ఆవు మృతి

బూర్జ: మండలంలోని లక్కుపురం గ్రామానికి చెందిన పాడి రైతు ముడిల గౌరునాయుడుకు చెందిన పాడి ఆవు శుక్రవారం మృతి చెందింది. పాడిరైతు గౌరినాయుడు రూ.80 వేల విలువచేసే పాడిఆవులు కొనుగోలు చేసుకుని దానిపైనే జీవనం సాగిస్తున్నాడు. అయితే అనారోగ్యానికి గురైన ఆవు చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆవు మృతితో తాము తీవ్రంగా నష్టపోయామని, తమ కుటుంబ పోషణ కష్టమవు తుందని రైతు గౌరి నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ కార్యాలయ ఆవరణలో మంటలు

ప్రజాశక్తి- పలాస

పలాస విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయ ఆవరణలో ఎపి ఫైబర్‌కు సంబంధించిన వైర్లు శుక్రవారం మధ్యాహ్నం దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదం ఏ విధంగా జరిగిందో తెలియ రాలేదు. మంటలు వ్యాపి స్తుండడంతో స్థానికులు అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. రూ.10 వేలు విలువైన వైర్లు కాలిపోయి ఉంటాయని అంచనా. కేబుల్ వైర్లు స్టోరేజ్ చేయడానికి విద్యుత్ కార్యాలయం సమీపంలో పెట్టారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ గోడకు ఆనించి ఉన్న కేబుల్ వైర్లపై సిగిరెట్ పారబోయడంతో ఎండ వేడికి మొత్తం మంటలు వ్యాపించి ఉంటాయని అగ్నిమాపకశాఖ సిబ్బంది అనుమానిస్తున్నారు. మంటలు చెలరేగి ఉంటే సమీపంలో ఉన్న విద్యుత్ కార్యాలయానికి ప్రమాదం జరిగి ఉండేది. అధికారులు సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

నేడు సర్వసభ్య సమావేశం

రణస్థలం: మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 11 గంటలకు ఎంపిపి పిన్నింటి రజని అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు శాఖల వారీగా నివేదికలతో హాజరుకావాలన్నారు. అలాగే మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, జెడ్‌పిటిసి, కో-ఆప్షన్ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న సంధ్యారాణి

బైపిసితో ఉజ్వల భవిష్యత్

నరసన్నపేట: బైపిసి అంటే కేవలం ఎంబిబిఎస్, బిడిఎస్ కోసమే అనే ఆలోచన వీడాలని, ఈ అర్హతతో ఇప్పుడు మరెన్నో కోర్సులు అందుబాటులోకి వచ్చాయని, వీటితో ఉజ్వల భవిష్యత్‌కు మార్గం వేసుకునే అవకాశం ఉందని డాక్టర్ ఎల్. సంధ్యారాణి అన్నారు. శుక్రవారం పద్మావతి జూనియర్ కళాశాలలో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఎంసెట్ ప్రోగ్రాం విద్యార్థులతో ఆమె మాట్లాడారు. పారామెడికల్ కోర్సులు బైపిసి విద్యార్థులకు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను అందిస్తున్నాయన్నారు. అగ్రికల్చల్ బిఎస్‌సి చేయడం ద్వారా ప్రభుత్వ విభాగంలో వ్యవసాయ శాఖలో వ్యవసాయ అధికారు లుగాను, బ్యాంకుల్లో రూరల్ బ్యాంకింగ్ ఆఫీసర్‌గా స్థిరపడవచ్చునని అన్నారు. ఏదైనా ఒక విదేశీ భాష నేర్చుకొని ఆ దేశంలో నర్సింగ్ వృత్తిలో చేరేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గ ప్రసాద్, అకడమిక్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు, అడ్మిషన్స్ డీన్ ఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.

డ్రాపౌట్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

కవిటి: డ్రాపౌట్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఇద్దీవాని పాలెంలో అవగాహన కల్పించి డ్రాపౌట్ విద్యార్థి బైపల్లి మేనకను పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఆర్ఎంఎస్ తనుజా పాల్గొన్నారు.

విద్యార్థినిని పాఠశాలలో చేర్పిస్తున్న ఎంఇఒ

నేడు సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- పొందూరు

మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం బిసి కార్పొరేషన్ రుణాల దరఖాస్తులను పరిశీలించనున్నట్లు ఎంపిడిఒ మీసాల మన్మథరావు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పంచాయతీల నుంచి ఆన్‌లైన్ ద్వారా రుణాల కోసం 706 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు పేర్కొన్నారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్ల పరిశీలనను బ్యాంకు మేనేజర్ల సమక్షంలో చేపట్టనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ఆమదాలవలస: ప్రభుత్వం బిసి కార్పొరేషన్ ద్వారా మంజూరు చేస్తున్న సబ్సిడీ రుణాలకు ఎంపిడిఒ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనునట్లు ఎంపిడిఒ ఆర్. వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ ద్వారా రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు శనివారం ఉదయం 10.30 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని, ధ్రువపత్రాల పరిశీలనతో పాటు బ్యాంకు అధికారులతో కలిసి అర్హులైన దరఖాస్తుదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

మెళియాపుట్టి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 29న ఉదయం 11 గంటలకు బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు ఆధార్, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్ ఫోటోలతో, రెండు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలు తీసుకోవాలని తెలిపారు.

రేషన్ కార్డుదారులకు ఇకెవైసి తప్పనిసరి

పలాస: రేషన్ కార్డు లబ్ధిదారులంతా ఇకెవైసి చేయించుకోవడం తప్పనిసరని తహశీల్దార్ టి. కళ్యాణ చక్రవర్తి అన్నారు. కాశీబుగ్గ నెహ్రూనగర్‌లోని వాడ శ్రీకాంత్ డిపో వద్ద జరుగుతున్న ఇకెవైసి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మండుటెండలో ఉన్న లబ్ధిదారులు తహశీల్దార్‌కు ఇకెవైసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తహశీల్దార్ లబ్ధిదారులు బారులు తీరి ఉండడాన్ని గుర్తించారు. డీలర్ శ్రీకాంత్ మాట్లాడగా సర్వర్ లేటు అవుతుండడంతో ఇకెవైసి వేగంగా కావడం లేదని, లబ్ధిదారులకు పూర్తిస్థాయి సమాచారం లేకపోవడంతో చాలా మంది రాలేకపోతున్నారని, గడువు తక్కువగా ఉండడంతో పూర్తిస్థాయిలో జరిగే అవకాశాలు కనిపించడం లేదన్నారు. దీనిపై తహశీల్దార్ డిపో వద్ద నుంచే జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి రేషన్ కార్డు లబ్ధిదారులు ఇకెవైసికి పడుతున్న ఇబ్బందులు వివరించి వాటిని నివృత్తి చేయాలని కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెలఖరులోగా లబ్ధిదారులు ఇకెవైసి చేయంచుకోవాలని, సమయం తక్కువగా ఉందని, అందుకోసం ఉన్నతాధికారులతో మాట్లాడి నెట్ సీడ్ పెంచమని కోరమన్నారు. దీనిని ప్రజలు అంతా గుర్తించి ఇకెవైసి తప్పని సరిగా చేయించుకోవాలని కోరుతున్నామన్నారు.

19 మోడల్ పాఠశాలల ఏర్పాటు

టెక్కలి: రానున్న విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయనున్న మోడల్ స్కూళ్ల ఏర్పాటులో భాగంగా టెక్కలి మండలంలో 19 మోడల్ స్కూళ్ల ఏర్పాటుకు విద్యాశాఖాధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. మండలంలోని 27 పంచాయతీలున్నప్పటికీ మెదటి విడతగా 15 పంచాయతీలను మాత్రమే తీసుకున్నారు. వీటిలో భాగంగా పెద్దశాన, భగవాన్‌పురం, రాళ్లపేట, బొరిగిపేట, అక్కవరం గ్రామాల్లో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలు రద్దు కాబడి ఆయా పాఠశాల్లో 6వ తరగతి నుంచి 8వతరగతి వరకు చదువుతున్న విద్యార్థులను సమీపంలో ఉన్న ఉన్నత పాఠశాల్లో విలీనం జరిగే విధంగా ప్రణాళిక రూపొందించారు. పెద్దరోకళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల రద్దుకు గ్రామకమిటీలు, ఉపాధ్యాయులు తమ ఆంగీకారాన్ని తెలియజేశారు. అదే విధంగా సవరకిల్లి, చల్లపేట, చింతలగార, శాసనం, జగన్నాధపురం, కిట్టాలపాడు, పాతనౌపడ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను సమీపంలో ఏర్పాటు చేయనున్న మోడల్ స్కూళ్లకు పంపనున్నారు. అదే విధంగా భరగాం, చాకిపల్లి, లింగాలవలస, మేఘవరం, నర్సింగపల్లి, పాతనౌపడ, పెద్దశాన, రావివలస, శాసనాం, సీతాపురం, తిర్లంగి, టెక్కలి పంచాయతీ పరిధిలోని ఆదిఆంధ్రావీది, మెయిన్‌బజార్, శ్రీనివాసనగర్, టెక్కలి కండ్రవీధి పాఠశాలలు మోడల్ స్కూళ్లు ఏర్పాటు కానున్నాయి. ఇందుకు సంబంధించిన నివేదికను మండలస్థాయి విద్యా శాఖాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను అందించారు.

క్రీడలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

శర్వాణిలో వార్షిక క్రీడోత్సవాలు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని అరసవల్లిరోడ్డులో ఉన్న శర్వాణి విద్యాలయంలో శుక్రవారం వార్షిక క్రీడోత్సవాలను ఘనంగా నిర్వహించారు. నగరానికి చెందిన ఐపిఎల్ క్రికెటర్ ఎస్. హిమ శ్రీనివాస్ పతాకావిష్కరణ చేసి క్రీడాకారుల నుంచి గౌరవవందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సంస్థ అధినేత అందవరపు సూరిబాబు హాజరై మాట్లాడుతూ శర్వాణిలో ప్రతి విద్యార్థి అన్ని రంగాల్లో నిష్ణాతునిగా అభివృద్ధి చెందడానికి పౌండేషన్ జరుగుతుందన్నారు. క్రీడల ద్వారా విద్యార్థులకు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. క్రికెటర్ హిమశ్రీనివాస్ మాట్లాడుతూ నిరంతర శ్రమ, నైపుణ్యం పెంపొందించుకుంటే ఏ రంగంలోనైనా రాణించ గలరన్నారు. కార్యక్రమంలో సంస్థ కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు, ప్రిన్సిపాల్ డా. కె.రేఖ, వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ మదీనా తదితరులు పాల్గొన్నారు. క్రీడల్లో విజతేలకు బహుమతులు అందజేశారు.

వేలంపాట నిర్వహిస్తున్న పురపాలక సంఘ అధికారులు

ఎట్టకేలకు ఆశీలు వేలంపాట ఖరారు

ఆమదాలవలస: ఎట్టకేలకు మూడోసారి నిర్వహించిన మార్కెట్ ఆశీల వేలంపాట ఒక కొలిక్కి వచ్చింది. శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో మేనేజర్ బిషోయ్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 2025 - 26 సంవత్సరానికి మూడోసారి మార్కెట్ ఆశీల వేలంపాట నిర్వహించారు. ఈ పాటలో గుత్తేదారులు ముగ్గురు పాల్గొన్నారు. ముందుగా సర్కారు పాట రూ.18 లక్షల 24 వేలు ఖరారు చేసి అధికారులు ప్రారంభించారు. గుత్తేదారు బొడ్డేపల్లి దాలినాయుడు రూ.22 లక్షల 50 వేలకు పాటను పాడారు. హెచ్చు పాటదారుడుగా దాలినాయుడు నిలిచారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తమ్మినేని గోవిందరావు మాట్లాడుతూ రూ.22 లక్షల 50 వేలకు అదనంగా రూ.5 లక్షల నాలుగు వేలు స్వీపర్ చార్జీలు చెల్లించాలని తెలిపారు. మార్కెట్ ఆశీల వేలంపాట వివరాలను ఉన్నతాధికారులకు నివేదించి వారి అనుమతితో పాటను ఖరారు చేయడం జరుగుతుందని తెలిపారు.

ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం

నరసన్నపేట: సమగ్ర యువజన విధానం అమలు కాకపోవడంతో రోజురోజుకు దేశంలో నిరుద్యోగం పెరుగుతుందని దీనిని వెంటనే నిర్మూలన చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఎఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ అమలు కాకపోవడం వలన దేశంలో నిరుద్యోగం పెరుగుతూ వస్తుందని, మత రాజకీయాల తప్ప దేశంలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటీకరణ చేస్తున్నారని దీనివలన ఉపాధి ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఆదుకొని నిరుద్యోగ భృతి ఇవ్వాలని, భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ ద్వారా దేశంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఎఐవైఎఫ్ నాయకులు అరవింద్, వసంత్, వాసు, క్రాంతి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

ప్రజాశక్తి- నౌపడ

నౌపడ : శిక్షణలో మాట్లాడుతున్న ఎపిఎం సూర్యనారాయణ

ప్రతి మహిళ ఒక పెట్టుబడిదారీగా తయారై ఆర్థిక ప్రగతి సాధించే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని సంతబొమ్మాళి ఎపిఎం ఎం.సూర్యనారాయణ తెలిపారు. మండల వెలుగు కార్యాలయంలో శుక్రవారం విఒఎలు, ఎన్యుమరేటర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో 1883 స్వయం సహాయక సంఘాల నుంచి 304 మందిని ఎంపిక చేసి నాలుగు బ్యాచ్‌లలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనిలో భాగంగా జియో ఫెన్సింగ్, సభ్యుల పేస్ క్యాప్చరింగ్, జీవనోపాధుల ప్రణాళిక తయారు చేయడంలో అవలంభించాల్సిన పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. వారికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం వివిధ రకాల సంస్థల నుంచి అందజేసి వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు అన్ని విధాల సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సమైక్య అధ్యక్షులు పి.భానుమతి, మండల సమైక్య కోశాధికారి సంధ్యారాణి, సిసిలు వరదరాజు, నీలావతి, పార్వతి, చిట్టెమ్మ, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

పలాస: పలాస వెలుగు కార్యాలయంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్వయంశక్తి సంఘ సభ్యులకు శిక్షణా కార్యక్రమాన్ని ఎంపిఎం జాంబవతి ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘాల నుంచి విద్యావంతులై సంఘాలపై అవగాహన, సేవాభావం ఉన్న వారిని ఎన్యుమరేటర్లుగా గుర్తించి వారికి యాప్ వినియోగంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో ఎల్‌సి చిట్టిబాబు సాహు, అకౌంటెంట్ కళ్యాణి, ఎంఎస్ అధ్యక్షులు జి.శాంతమ్మ, సిసి ధనలక్ష్మి, ఎస్‌పి నాగమ్మ, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలకు కావలసిన అప్పులు, జీవనోపాదుల ప్రణాళికల తయారీపై ఎపిఎం జి. నారాయణరావు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి గ్రామ సంఘ అసిస్టెంట్లు, ఆరు సంఘాలకు ఒకరు చొప్పున ఎంపిక చేయబడిన ఎన్యూమరేటర్లకు శిక్షణ నిర్వహించారు. శిక్షణకు మండల ంలోని ఎన్యుమరేటర్లు, విఒఎలు, సిసిలు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండల కేంద్రంలోని ఇందిరా క్రాంతి భవనంలో సర్వేకు ఎంపిక చేసిన సిసి విఒ ఎన్యుమరేటర్స్ శిక్షణా కార్యక్రమాన్ని ఎంపిఎం సిహెచ్ గోవిందరాజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షులు పేడాడ మణెమ్మ, అకౌంటెంట్ కళ్యాణి పాల్గొన్నారు.

మందస: మండల మహిళా సమాఖ్యలో ఎపిఎం పైడి కూర్మారావు ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, విఒఎలు, గ్రామ సంఘాల నుంచి ఎన్నికైన ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

గుజరాతీపేట : మాట్లాడుతున్న న్యాయమూర్తి జామరుద్ బేగం

'పోక్సో' చిన్నారులకు రక్షణ కవచం

ప్రజాశక్తి- గుజరాతీపేట

ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీసెస్ కమిటీ మార్గదర్శకత్వంలో జువైనల్ జస్టిస్ బోర్డులో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రథమ అదనపు న్యాయమూర్తి కె.ఎం.జామరుద్ బేగం, లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్ తలే లక్ష్మణరావు పాల్గొని చిన్నారులపై లైంగిక నేరాలను అరికట్టడంలో పోక్సో చట్టం ప్రాముఖ్యతను వివరించారు. ఈ చట్టం లక్ష్యం, చిన్నారులపై లైంగిక దాడులు, వేధింపులు, అశ్లీల చిత్రాల నుంచి రక్షణ, బాధితులకు న్యాయ సహాయం అందించడం ఈ చట్టం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పోక్సో చట్టం ప్రకారం నేరస్తులకు కఠినమైన శిక్షలు ఉంటాయని, నేరం తీవ్రతను బట్టి జైలుశిక్ష, జరిమానాలు విధించబడతాయని, తీవ్రమైన లైంగిక వేధింపుల కేసుల్లో మరణశిక్ష విధించే అవకాశం కూడా ఉందన్నారు. చిన్నారులపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు సమాజం మొత్తం కలిసి పనిచేయాలన్నారు.

టెక్కలి: లైంగిక నేరాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆటువంటి వారికి కఠినమైన శిక్షలు ఉంటాయని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. ఎం.జె.పి.బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం ఆవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైంగిక నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలపై జరుగుతున్న అకృత్యాల్ని అడ్డుకోవాలన్నారు. పోక్సో చట్టంపై అవగాహన అవసరమన్నారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, ప్యానల్ న్యాయవాదులు ఎం.గోవింద్, ఎల్.బాలకృష్ణ, పోట్నూరు ఆనందరావు, బి.శ్రీనివాస్, రాజేష్, ఎంఇఒలు తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, ప్రిన్సిపాల్ పూసపాటి సుధారాణి, ఎస్.ఐ పి.రఘునాధరావు, మెట్ట సురేష్ విద్యార్థినులు పాల్గొన్నారు.

పలాస: విద్యార్థులు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సీనియర్ న్యాయవాదులు బలివాడ కామేశ్వరరావు పట్నాయక్, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జి.ఎం.ఎస్.అనిల్ రాజు కోరారు. మండల లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి అధ్యక్షతన విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మెంబర్ కోత రజినికుమార్, లోక్ అదాలత్ మెంబెర్ ప్రభాకర్, న్యాయవాదులు లోకేష్, దేవరాజు, శ్యాం, డిగ్రీ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కక్షసాధింపు తప్ప అభివృద్ధి శూన్యం

కోటబొమ్మాళి: సూపర్‌సిక్స్ పథకాల హామీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకపోగా పాలనపై ప్రశ్నించే వారిపై కక్షసాధింపు చర్యలు తప్ప రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావు అన్నారు. శుక్రవారం వైసిపి మండల అధ్యక్షుడు సంపతిరావు హేమసుందరరాజు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను అడ్డం పెట్టుకొని ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా అడ్డుపడుతూ, ముఖ్యంగా ఒక సామాజిక తరగతిపై కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారన్నారు. మంత్రులు, అధికార పార్టీ నాయకులు ఎన్ని కక్షసాధింపు చర్యలు చేపట్టినా ప్రజలు, వైసిపి కార్యకర్తలు మాజీ సిఎం జగన్‌మోహన్ రెడ్డి వైపే ఉన్నారన్నది నిన్నటి ఎన్నికల విజయాలు చూస్తే అర్థమవుతుందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అందిస్తామని చెప్పి సిఎం చంద్రబాబు ప్రజలను ఘోరంగా మోసం చేశారని వారు పేర్కొన్నారు. వ్యవసాయశాఖా మంత్రి అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలో ఖరీఫ్‌లో రైతులు పండించిన వరి పంటను కొనుగోలు చేయక ఇంకా పొలాల్లోనే ఉన్నాయని, రైతులు ఉసూరుమంటున్నారని వారు పేర్కొన్నారు. మంత్రి తన కార్యాలయంలో సమావేశాలు పెట్టడంమాని గ్రామాల్లో పర్యటిస్తే రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు అర్థమవు తాయన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పేడాడ వెంకటరావు, దుక్క రామకృష్ణ, కాళ్ల సంజీవరావు, బగాది దివాకర్, మెండ జగన్నాధం, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

పన్నుల వసూళ్లకు ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లింపుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు. ఈ నెల 30, 31 తేదీల్లో పన్నుల చెల్లింపు కౌంటర్లు పనిచేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆస్తిపన్ను బకాయిలు చెల్లించేందుకు వీలుగా మున్సిపల్ శాఖ తగిన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆస్తి పన్ను బకాయిల వడ్డీపై 50 శాతం రాయితీ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మార్చి 31 వరకే గడువు ఉండటంతో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ కౌంటర్లు పనిచేస్తాయన్నారు.

డ్రైవర్, కండక్టర్లను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

ఆర్‌టిసి డ్రైవర్, కండక్టర్లకు సన్మానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం విద్యార్థుల కోసం ఆర్‌టిసి బస్ సౌకర్యం కల్పించింది. దీంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ ఆర్‌టిసి డిపో మేనేజర్ శ్రీనివాస్ నాయుడుకు బస్ సౌకర్యం కల్పించాలని లిఖిత పూర్వకంగా లేఖరాసి, ఫోన్‌లో విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలు వివరించగా స్పందించిన మేనేజర్ పదో తరగతి పరీక్షలు జరుగుతున్న రోజుల్లో ఉదయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొలిగాం వద్ద నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మందపల్లిలో గల పరీక్షా కేంద్రం వరకు, పరీక్ష ముగిసిన తరువాత మరలా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొలిగాం వరకు బస్సు సౌకర్యం కల్పించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమయానికి పరీక్ష కేంద్రం వరకు తీసుకెళ్లి, తీసుకువచ్చినందుకు డ్రైవర్ పి.పోలారావు, కండక్టర్లు కైలాష్, శ్రీనివాస్‌కు హెచ్‌ఎం, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు శ్రీకాంత మహంతి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, చంద్రవదన, పద్మావతి, రేణుక, శ్రీనివాస్, పాపారావు, మినుచంద్ర, శ్రీనివాస్ పుండీ, దేవకి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో ఆర్‌డిఒ సమీక్ష

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి నియోజకవర్గం పరిధిలో గల టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులతో టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి గురువారం రాత్రి సమీక్షించారు. కార్యాలయ ఛాంబర్‌లో మండలాల వారీగా ఉపాధ్యాయులతో చేపట్టిన సమీక్ష రాత్రి వరకు కొనసాగింది. 117 జిఒ అమల్లో భాగంగా రానున్న విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయనున్న పంచాయతీకొక మోడల్ స్కూల్ ఏర్పాటుపై ఉపాధ్యాయుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మండలాల్లో కొన్ని ప్రాథమిక పాఠశాలల స్థానంలో మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేసి సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతుల వరకు నిర్వహణ జరుగుతుందని, దీనిని గతంలో గ్రామ విద్యా కమిటీలు మోడల్ స్కూల్స్ ఏర్పాటుకు వ్యతిరేకించడం జరిగిందని, ఆయా గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు చైతన్యవంతంగా ఆలోచించి కమిటీలను ఒప్పించాలని ఆర్‌డిఒ సూచించారు. మోడల్ స్కూల్స్ ఏర్పాటు వలన విద్యారంగం బలోపేతం కానుందని, విలీనం వలన ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఉపాధ్యాయులకు స్పష్టం చేసినట్లు సమాచారం. నాలుగు మండలాల పరిధిలో ఏయే పంచాయతీల పరిధిలో గల పాఠశాలలు మోడల్ స్కూళ్లుగా ఏర్పాటు కాబడుతున్నాయో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతోనే ఆర్‌డిఒ ఈ సమీక్ష నిర్వహించారు. సమీక్షలో భాగంగా ప్రస్తుతం ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలు పూర్తిగా రద్దు కాబడతాయన్న స్పష్టమైన అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేయడం గమనార్హం.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆమదాలవలస : మాట్లాడుతున్న ఎంపిడిఒ పావని

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వం వివిధ కార్పొరేషన్‌ల ద్వారా అందిస్తున్న సబ్సిడీ రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎం.పావని కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సబ్సిడీ రుణాల దరఖాస్తుదారులకు బ్యాంక్ అధికారులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని 21 పంచాయతీలకు 52 యూనిట్లు మంజూరు కాగా 271 మంది దరఖాస్తులు చేసుకున్నారు. బిసి, ఇడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా మంజూరైన రుణాలకు బ్యాంకు అధికారులతో కలిసి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని, ఎంపికైన అభ్యర్థులు సబ్సిడీ రుణాలతో యూనిట్లను సక్రమంగా నిర్వహించి ఉపాధి పొందడంతో పాటు ప్రభుత్వ ఆశయాన్ని నెర వేర్చాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ మేనేజర్ పి.చంద్రమౌళి, ఎపిజివిబి మేనేజర్లు హెచ్. అమర్నాథ్, కె.రవికుమార్, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ మహేంద్ర పాల్గొన్నారు.

పోలాకి: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన బిసి కార్పొరేషన్ ఇంటర్వ్యూలకు 522 మంది దరఖాస్తుదారులు హజరైనట్టు ఎంపిడిఒ జి.రవికుమార్ తెలిపారు. రుణాల కోసం 589 మంది దరఖాస్తులు చేసుకున్నారు. 522 మంది హాజరయ్యారు. అర్హుల జాబితాను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సూర్య ప్రకాష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లావేరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కార్పొరేషన్ రుణాలకు ఎంపిడిఒ పి. వెంకటరాజు ఆధ్వర్యంలో రుణాలకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులను లావేరు, అదపాక విశాఖ గ్రామీణ బ్యాంక్‌ల అధికారులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు.

విద్యార్థులకు లస్సీ పంపిణీ

ప్రజాశక్తి- కవిటి

పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయంలో ఎండ తీవ్రత దృష్ట్యా గత ఐదురోజులుగా బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గ్రామంలోని యువత పలు రకాల పానీయాలు పంపిణీ చేస్తోంది. ఈ సందర్భంగా ఆరో రోజు ఇంటర్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఎస్ఎస్ రియల్ ఎస్టేట్ ఫౌండేషన్ డెవలపర్స్ దుర్ధి శ్రీను ఆర్థికసాయంతో సుమారు 400 మంది విద్యార్థులకు లస్సీ పంపిణీ చేశారు. అనంతరం గ్రామ యువత మాట్లాడుతూ దాతల సహకారంతో పదో తరగతి పరీక్షలు పూర్తయ్యేవరకూ ఈ కార్యక్రమం నిరాటంకంగా కొనసాగిస్తామని తెలిపారు.

ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల అనుమానాస్పద మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి ఆయన కుటుంబసభ్యులకు న్యాయం చేయాలని క్రిస్టియన్ సెక్యూర్ సర్వీసెస్ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షులు బర్నబాస్, ఓంపురి రమేష్ ఆధ్వర్యాన చేపట్టిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈనెల 24న తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు టోల్‌గేట్ సమీపంలో ప్రవీణ్ మృతి చెందారని, ఈఘటనపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. వివాద రహితుడైన ఆయనను కొందరు వెంబడించినట్టు అనుమానాలు ఉన్నాయని, వీటిని నివృత్తి చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. జెసిని కలిసిన వారిలో ఎం.షడ్రక్ బాబు, జి.సామ్యూల్, అరుణ్ కుమార్, పేతురు, ఇ.శామ్యూల్ జాన్, ప్రత్తిపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

టెక్కలి: ప్రవీణ్ మృతిపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించాలని దళిత సంఘాల జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. అనంతరం కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవీణ్ మరణంపై ఉన్న మిస్టరీని పోలీసులు చేధించాలన్నారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట వేదిక జిల్లా అధ్యక్షులు యడ్ల గోపి, సమతాసైనిక్ దల్ జిల్లా కార్యదర్శి చల్లా రామారావు, ఎంపిపి ప్రతినిధి ఆట్ల రాహుల్‌కుమార్, దళిత మహాసభ జిల్లా అధ్యక్షులు బొకర నారాయణరావు, కులనిర్మూలనా పోరాటసమితి జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకరరావు, సుంకు గోపీనాథ్, జనచైతన్య మండలి నాయకులు కొమ్మల దమయంతి, కొచ్చాశ్రీనివాస్, జర్జాన బాబూరావు, చిన్నారావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : జెసికి వినతిపత్రం అందజేస్తున్న సిఎస్ఎస్ సభ్యులు

నందిగాం: ఇటీవల రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ కుమార్‌ను హత్య చేయడం హేయమైన చర్యని మండల దళిత సంఘ ప్రతినిధి ఎ.సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాటి మానవులు సమాజంలో బతికేందుకు భయం కలుగుతుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు కావస్తున్నా నేటికి దళితులపై దాడులు ఆగడం లేదని, దీనిని దృష్టిలో ఉంచుకొని పాలకులు పాస్టర్ హత్యకు పాల్పడిన వారిని ఉరిశిక్ష విధించాలని ఆయన డిమాండ్ చేశారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, సిసిరోడ్లు, తారురోడ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. మండలంలో వేల్పురాయిలో రూ.31 లక్షలతో సిసి రోడ్లు, అర్జునవలసలో రూ.23 లక్షలతో సిసి రోడ్లు, బంటుపల్లిలో రూ.1.20 కోట్లతో తారురోడ్డు నిర్మాణం, కమ్మసిగడాంలో రూ.4,40,000తో మినీ గోకులం, వల్లభరావు పేటలో రూ.28 లక్షలతో సిసి రోడ్లు, దేరసాంలో రూ.56.2 లక్షలతో సిసి రోడ్లు, పాతర్లపల్లిలో రూ.9.01 కోట్లతో తారురోడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, మాజీ జెడ్‌పిటిసి గొర్లె లక్ష్మణరావు, సర్పంచ్ బాలి శ్రీను, జగన్నాధం నాయుడు, గొర్లె సాయి, మైలపల్లి పోలీస్, మండపాక కనకరావు, ఎంపిడిఒ ఈశ్వరరావు, తహశీల్దార్ ప్రసాదరావు, ఇంజనీరింగ్ అధికారి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న చౌదరి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్నచౌదరి జన్మదిన వేడుకలు పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ, మండలంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి కార్యాలయంలో ఎపిటిపిసి ఛైర్మన్ వజ్జ బాబూరావు ఆధ్వర్యంలో కేకు కట్ చేసి నాయకులకు పంచిపెట్టారు. ఈ కార్యాక్రమంలో లోడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, కొరికాన శంకర్, సవర రాంబాబు, చంద్రబౌళి, చిన్ని తదితరులు పాల్గొన్నారు. అలాగే శాసనం, కిష్టుపురంలో జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బూర్లె కృష్ణంరాజు, దువ్వాడ సంతోష్, బూరె తులసి, ఆర్.సుధాకర్, నిమ్మాడ బాబూరావు, దల్లి ప్రసాదరావు, కుప్పిలి కామరాజు, దల్లి జయరాం, మహిళలు తదితరులు పాల్గొన్నారు. అలాగే కాశీబుగ్గ బస్టాండ్ వద్ద వెంకన్నచౌదరి యూత్ ఆధ్వర్యంలో ప్రయాణికలకు మజ్జిగ పంపిణీ చేశారు.

ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రాజకీయ జోక్యం సరికాదు

ప్రజాశక్తి- బూర్జ

మేట్లు నియామకంలో రాజకీయ జోక్యం సరికాదని నీలాదేవిపురం ఎంపిటిసి ప్రతినిధి మజ్జి నర్సింగరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో మేట్ల నియమకాల్లో జరుగుతున్న అవకతవకలపై ఎంపిడిఒ తిరుపతిరావు, ఎంపిపి కర్నెన దీప దృష్టికి తీసుకు వచ్చారు. వేతనదారులు అనుకూలంగా మేట్ల ఎంపికతో పాటు నియామకం జరగాల్సి ఉందని, అయితే అందుకు విరుద్ధంగా రాజకీయ జోక్యంతో నియమకాలు జరుగుతున్నాయని వారి దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికైనా వేతనదారులకు అనుకూలంగా మేట్ల నియామకం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు లావేటి శ్రీను, లావేటి లక్ష్మణ, పైల చిన్నబాబు, పొన్నాడ సోంబాబు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న పద్మజ

ఉత్తమ మోటివేషనల్ స్పీకర్ ట్రైనర్‌గా పద్మజ

ప్రజాశక్తి- పలాస

హైదరాబాద్ ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థకు జిల్లా అధ్యక్షురాలుగా మల్లా పద్మజ ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో గత రెండురోజులుగా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోటివేషనల్ స్పీకర్ ట్రైనర్ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా మల్లా పద్మజ ఉత్తమ మోటివేషనల్ స్పీకర్ ట్రైనర్‌గా ఎంపికయ్యారు. అనంతరం ప్రముఖ మోటివేటర్ గంప నాగేశ్వరరావు, ప్రముఖ సినిమా ఆర్టిస్ట్ ప్రదీప్ కుమార్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని ఆమె అందుకున్నారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో సమాజంలో ఉన్న సమస్యలు, మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, మహిళలపై అత్యాచారాలు, డ్రగ్స్ తదితర అంశాలపై నిత్యం ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. సంస్థ స్వచ్ఛందంగా నిర్వహించి ప్రజలకు తమవంతు సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు వస్తున్నామన్నారు. ఆమె ఉత్తమ మోటివేషనల్ స్పీకర్ ట్రైనర్‌గా, జిల్లా అధ్యక్షులుగా ఎంపిక కావడంపై వైశ్య సంఘం నాయకులు మల్లా భాస్కరరావు, మల్లా కృష్ణారావు, పి.వి సతీష్, మాజీ కౌన్సిలర్ బల్ల ఉషారాణి తదితరులు అభినందనలు తెలిపారు.

బెంతు ఒరియా యువకుల ప్రతిభ

కవిటి: ఇటీవల పార్వతీపురంలో జరిగిన 31వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గం కవిటి, కంచిలి మండలాలకు చెందిన బెంతు ఒరియా యువకులు దుదిష్టి మజ్జి (55 కేజీల విభాగంలో) 3వ స్థానం, సునీల్ దలై (65 కేజీల విభాగంలో) నాలుగో స్థానం సాధించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను వీరు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ రంగంలో మరింత శ్రద్ధ కనబరిచి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నేడు దూసి ధర్మారావు జయంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కవి, రచయిత స్వర్గీయ దూసి ధర్మారావు 75వ జయంతి శనివారం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో నిర్వహిస్తున్నట్టు పౌండేషన్ సభ్యులు పి.జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మృతి చెందిన సంగీత దర్శకులు బండారు చిట్టిబాబుకు నివాళ్లర్పించనున్నట్టు తెలిపారు. అనంతరం పలువురిని సత్కరించనున్నట్టు వివిరించారు.